

బాధిత కుటుంబానికి గుడ్‌సీడ్ సాయం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం



సాయం అందిస్తున్న గుడ్ సీడ్ సభ్యులు

ఎన్.కొత్తపల్లి పంచాయతీ రాఘవులపేటలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది.ఈ ప్రమాద ఘటనలో కర్రి వెంకటేశ్వరరావు కుటుంబం సర్వం కోల్పోయింది. మంగళవారం గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్, అమలాపురం నియోజకవర్గం వైసిపి నేత కుంచే రమణారావు బాధిత కుటుంబానికి సాయం అందించారు. వంట సామగ్రి, బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులను సర్పంచ్ కుంచే చిట్టికుమారి చిన్ని ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు సాదే ఆంజనేయులు, కుంచే అర్జునరావు, పరమట రాజేష్, తోకల రాజ్ కుమార్ తదితరులు అందజేశారు.

'కోనసీమ' కూత వినిపించేనా..?

- మధ్యలో నిలిచిపోయిన
- కోటిపల్లి-నర్సాపురం రైల్వే ప్రాజెక్టు
- రాష్ట్ర వాటా చెల్లిస్తేనే కొనసాగిస్తామని కేంద్రం వెల్లడి
- నేటి కేంద్రబడ్జెట్లో కేటాయింపులపై ఆసక్తిగా ఎదురుచూపు


నిలిచిపోయిన కోటిపల్లి -ముక్తేశ్వరం రైల్వే వంతెన పిల్లర్ల పనులు


రైల్వే లైన్ కోసం బైక్ ర్యాలీ చేస్తున్న జిల్లా రైల్వే సాధన సమితి నాయకులు(ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసుల చిరకాల వాంఛ అయిన కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్ కొరకు బుధవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టబోయే బడ్జెట్లో ఏ మేరకు నిధులు కేటాయిస్తారో అని ఈ ప్రాంత వాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రైల్వే లైన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం తన చెల్లించాల్సిన 25 శాతం వాటా నిధులు చెల్లించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం రైల్వే లైన్ నిర్మాణ పనులను వేగం తగ్గించారు. రెండు దశాబ్దాలకు పైగా కోనసీమలో రైలు కూత వినాలని ఎదురుచూస్తున్న ఈ ప్రాంత వాసుల ఆశలు ఆడియాసలుగానే మిగిలిపోయే పరిస్థితి ఏర్పడింది.కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ ప్రాజెక్ట్ దివంగత లోక్ సభ స్పీకర్ బాలయోగి కృషితో 2000లో అంకురార్పణ జరిగింది. అప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డిఏ ప్రభుత్వంలో రైల్వేశాఖమంత్రి మమతా బెనర్జీ ఈ ప్రాజెక్టుకు అమలాపురం పట్టణంలో పునాదిరాయి వేశారు. 2004 లో అమలాపురం రూరల్ భట్నవిల్లి వద్ద అప్పటి రైల్వే సహాయ మంత్రి ఆర్.వేలు రైల్వే స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు.

తొలుత ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.300కోట్లు మాత్రమే.ప్రారంభంలో 2001-02 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర రైల్వే బడ్జెట్ లో ఈ ప్రాజెక్టుకు 20 కోట్లు రూ మంజూరు చేశారు. 2002లో దురదృష్టవశాత్తు హెలికాప్టర్ ప్రమాదంలో లోక్ సభ స్పీకర్ బాలయోగి మరణించడంతో ఈ ప్రాజెక్టుకు తర్వాత సంవత్సరాలలో నిధులు మంజూరు తగ్గిపోయా ప్రతి సంవత్సరం రైల్వే బడ్జెట్ లో నిధులు మంజూరు అయ్యాయి. 2002-03 వ ఆర్థిక సంవత్సరం నుంచి 2015-16వ ఆర్థిక సంవత్సరం వరకూ అన్ని రైల్వే బడ్జెట్ లలో కలిసి ఆయాసంవత్సరాల్లో మొత్తం రూ.70 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. బాలయోగి మరణం తరువాత ఈ ప్రాజెక్ట్ గురించి పట్టించుకొనే నాధుడే లేకుండా పోయారు. గత 15 సంవత్సరాలుగా ప్రతి ఏటా రైల్వే బడ్జెట్ లో ఈ పెండింగ్ రైల్వే ప్రాజెక్టుకు నిధులు కేటాయింపు భారీ స్థాయిలో ఉంటాయని కోనసీమ ప్రజలు ఎదురు చూసేవారు. కానీ వారి ఆశలు అడియాశలయ్యేవి. జిల్లాలో బట్నవిల్లి నుంచి దిండి వరకు సుమారు 700 ఎకరాలపైగా భూమిని రైల్వే లైను నిర్మాణ పనులకు సేకరించవలసిన పని పెండింగ్లో ఉంది. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి భూసేకరణ చేపడితే రైల్వే లైన్ నిర్మాణ పనులకు బాలారిష్టాలు తొలిగినట్లే.

టూరిజం అభివృద్ధితో పాటు ఎగుమతుల ద్వారా అదనపు ఆదాయం

కోనసీమకు కూడా రైల్వే లైన్ ఉండటం వలన టూరిజం పరంగా కోనసీమ అభివృద్ధి చెందుతుంది. ప్రతీరోజు కోనసీమ నుంచి ప్రైవేట్, ఆర్టీసి, హైటెక్ బస్సుల్లో దాదాపు 3,500 మంది ప్రయాణికులు హైదరాబాద్ ప్రయాణిస్తూ ఉంటారు. ఈ రైల్వే లైను వలన వరి, ఆక్వా ఉత్పత్తులు,కొబ్బరి కాయలు, కొబ్బరి బొండాలు ఎగుమతుల ద్వారా ఇక్కడ వ్యవసాయ దారులకు అదనపు ఆదాయమార్గాలు పెరుగుతాయి.ఆంధ్రప్రదేశ్ లోని ఓడ రేవులను ఈ రైల్వే మార్గం ద్వారా అనుసంధానం చేయవచ్చు.

బడ్జెట్లో కేటాయింపులు ఇలా

కేంద్రబడ్జెట్ లో 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.200కోట్లు, 2017-18 ఆర్థిక సంవత్సరంలో రూ.430 కోట్లు, 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.200 కోట్లు, 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.200 కోట్లు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో 551 కోట్లు వరుసగా ఈ పెండింగ్ రైల్వే ప్రాజెక్టుకు నిధులు కేటాయించారు. ఇప్పటి వరకు పెండింగ్ రైల్వే ప్రాజెక్టుకు కేంద్రం రూ.1600 కోట్లకు పైబడి కేటాయింపులు చేసినట్లయింది.

బ్రిటిష్ కాలంలోనే రైల్వే లైను

కాకినాడ నుంచి కోటిపల్లి వరకు రైలు మార్గం బ్రిటిష్ వారి హయాంలోనే 1929 సంవత్సరం నుంచి ఉంది. అయితే రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో అంటే 1940లో కోటిపల్లి నుంచి ఐరన్ ను తరలించేయడం వలన ఈ మార్గం మూసివేయబడినది. మరలా 2005లో కాకినాడ నుంచి కోటిపల్లి వరకు రైల్వే మార్గం పునరుద్ధరించారు. ప్రస్తుతం ఈ మార్గంలో ఒక రైలు బస్ మాత్రమే తిరుగుతోంది. ప్రస్తుతం ఆదాయం లేకపోవడంతో ఆ రైలు బస్సుని కూడా రైల్వే శాఖ వారు నిలుపుదల చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లిస్తేనే పనులు కొనసాగింపు

కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ సంబంధించి ప్రారంభంలో అంచనా వ్యయం రూ.300 కోట్లు కాగా అది ఇప్పుడు రూ.2200 కోట్లకు చేరుకుంది. 2008లో అప్పటి ఏపి సిఎం వైఎస్ఆర్ హయాంలో రైల్వే శాఖ మధ్య పెండింగ్ రైల్వే ప్రాజెక్ట్ కు సంబంధించి మొత్తం ప్రాజెక్ట్ వ్యయంలో 25 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించేలా ఒప్పందం జరిగింది .2008 నుంచి 2014 వరకు రైల్వే ప్రాజెక్టుకు ఏపి ప్రభుత్వం ఒప్పందం ప్రకారం ఏ విధమైన కేటాయింపులు చేయలేదు. 2014 -15 ఆర్థిక సంవత్సరం నుండి 2017-18 సంవత్సరము వరకూ రాష్ట్ర ప్రభుత్వం రూ.126 కోట్లు కేటాయించింది. ఇంకా రూ.525 కోట్లు కేటాయించాల్సి ఉంది. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం గత మూడు సంవత్సరాల రైల్వే ప్రాజెక్టుకు ఒక రూపాయి కూడా కేటాయించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగా ప్రాజెక్ట్ పనులు నిలిపివేసింది.

కేంద్ర బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరుతున్నాం



కోనసీమ రైల్వే లైన్ సాధన కోసం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ రైల్వే సాధన సమితి పేరుతో కమిటీ ఏర్పాటు చేశాం .ఇప్పటికే పలు మార్లు సమావేశమైన కమిటీ ఇటీవల కోటిపల్లి నుంచి నరసాపురం వరకు బైక్ ర్యాలీ నిర్వహించాం. ప్రజా ప్రతినిధులను అందరిని కలిసి వినతి పత్రాలు అందజేస్తున్నాం. బాలయోగి మరణం తర్వాత మాజీ ఎంపీ పండుల రవీంద్ర బాబు కేంద్ర బడ్జెట్లో రూ.200 కోట్లు రైల్వే లైన్ కోసం కేటాయింపు చేసేలా కృషి చేశారు. మరలా ఆ స్థాయిలో కేంద్ర బడ్జెట్ లో కేటాయింపులు కేటాయించాలని కోరుతున్నాం .రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించి రైల్వేలైన్ పూర్తయ్యేలా సహకరించాలని కోరుతున్నాం.

-కారెం వెంకటేశ్వరరావు, రైల్వే సాధన సమితి నాయకులు,అమలాపురం


అమలాపురంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఐవి

సిపిఎస్ రద్దు కోసం సంకల్ప దీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని ధర్మస్థలి లో చేపట్టబోయే సంకల్ప దీక్ష పోస్టర్ ను మంగళవారం అమలాపురం యుటిఎఫ్ హోమ్ వద్ద పిడిఎఫ్ ఎమ్ఎల్సి ఐ.వెంకటేశ్వరరావు(ఐ వి) ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంటివి.సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు పి.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బి.చంద్రకళ అమలాపురం మండల, పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రరావు, శ్రీనివాస్, దుర్గారావు, ఎన్వి.రమణ, యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **అంబాజీపేట** సిపిఎస్ రద్దు కోసం ఎపి యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 3 న కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలో సుందరయ్య విద్యానగర్ దర్మస్థలి నందు నిర్వహించే సంకల్పం లదీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని మండల యూటిఎఫ్ శాఖ పిలుపునిచ్చింది. మండల విద్యా శాఖ కార్యాలయంలో మంగళవారం సంకల్ప దీక్ష పోస్టర్ ను ఆవిష్కరించారు.మండల శాఖ అధ్యక్షులు పి.ఏడుకొండలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.రమణ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి సిపిఎస్ రద్దుకోసం దీక్ష లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పి.నారాయణమూర్తి, కె.హేమలత, కె.ఉమామహేశ్వరి, డిజె.రమేష్, ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


అంబాజీపేటలో పోస్టర్ ఆవిష్కరణ

కోనసీమ అల్లర్ల కేసులు ఎత్తి వేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

కోనసీమ అల్లర్ల నేపథ్యంలో నమోదైన కేసులను ఎత్తివేయాలని రాష్ట్ర శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కూడుపూడి సూర్య నారాయణరావు రాష్ట్ర మంత్రి విశ్వరూప్ ను కోరారు. మంగళవారం అమలాపురం కాటన్ అతిథి గహంలో మంత్రిని కలిసిన సూర్యనారాయణరావు పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ తప్పనిసరిగా సమస్యను ప్రభుత్వం దష్టిలో పెడతానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ ఛైర్మన్ రెడ్డి నాగేంద్ర మణి తో పాటు పలువురు శెట్టిబలిజ నేతలు ఉన్నారు.

యువతకు కొబ్బరి సంకరీకరణపై శిక్షణ

ప్రజాశక్తి - అంబాజీపేట

కొబ్బరి సంకరీకరణ శిక్షణతో యువతలో ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని కొబ్బరి పరిశోధనా కేంద్రం అధిపతి డా.బి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం అంబాజీపేట పరిశోధనా కేంద్రంలో సంకరీకరణలో భాగంగా బ్యాగింగ్ విధానము తదితర అంశాలపై హార్టీకల్చర్ శాస్త్రవేత్త ఎ.కిరీటి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పరాగ సంపర్కం, లెబిలింగ్, హెచ్ మార్కింగ్ విధానాలు తదితర అంశాను హార్టీకల్చర్ విభాగం రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ జి.కోటేశ్వరరావు వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్బివి.చలపతిరావు, డాక్టర్ వి. గోవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలు అవాస్తం

ప్రజాశక్తి-కొత్తపేట

వైసిపి నాయకులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని పలివెల గ్రామ సర్పంచ్ సాదే శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో ఆమె మాట్లాడుతూ పలివెల గ్రామపంచాయతీ పరిధిలో చేరే పాలెంలో రోడ్డు నిర్మాణ విషయంలో వైసిపి నాయకులు కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా రోడ్డు నిర్మాణాలు చేపడితే దళిత సర్పంచ్ అయిన నా మీద అధికార బలంతో అహంకార ధోరణి ప్రదర్శిస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో టిడిపి నాయకులుపాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రావులపాలెం ఎంపిపి

అంకితభావంతో వైద్యసేవలు అందించాలి

ప్రజాశక్తి-రావులపాలెం.

అంకితభావంతో ప్రజలకు వైద్యసేవలు అందించాలని రావులపాలెం ఎంపిపి, ఆసుపత్రి అభివద్ధి కమిటీ ఛైర్మన్ కర్రి లక్ష్మి వెంకట నాగదేవి వీర్రెడ్డి పిలుపునిచ్చారు. రావులపాలెం మండలం గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆమె అధ్యక్షతన జరిగిన ఆసుపత్రి అభివద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు, కొత్తపేట డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎం.సుమలత పాల్గొని ఆసుపత్రిలోని అభివద్ధి పనుల గూర్చి చర్చించి రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందేలా సూచనలు చేశారు. ఈ సందర్భంగా తీర్మానాలు ఆమోదించారు. లక్ష్మీ వెంకట నాగదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అనేక రకమైన మందులు వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. సమావేశంలో జెడ్పిటిసి, ఎక్స్ అఫీషియల్ సభ్యులు కుడుపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతనంగా వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ లకు ఎంపికైన సిబ్బందిని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. డాక్టర్ సుమలత మాట్లాడుతూ సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలన్నారు. సమావేశంలో చిర్ల రాము, కర్రి వీర్రెడ్డి, గోపాలపురం సర్పంచ్ సబ్బితి మోహన్ రావు, పొడగట్లపల్లి సర్పంచ్ గంధం దేవి అన్నవరం, ఎంపీడీవో జి. రాజేంద్రప్రసాద్, వైద్యాధికారులు సాయిలేఖ, స్వాతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

3న వివిధ వాహనాలకు వేలం

ప్రజాశక్తి - ఆలమూరు

జిల్లాలో ఎస్ఇబి ఆలమూరు స్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన ఇంజిన్ తో ఉన్న నాటు పడవతో పాటుగా వివిధ రకాల 3 ద్విచక్ర వాహనములకు ఫిబ్రవరి 3న వేలం వేస్తామని ఎస్ఇబి సిఐ కె.శ్రీధర్, ఎస్ఐ రాంబాబు మంగళవారం తెలిపారు. వాహనాలు మొత్తం 4 వాటికి 3(శుక్రవారం) ఉదయం 10 గంటలకు ఆలమూరు ఎస్ఇబి స్టేషన్ నందు వేలం ప్రారంభిస్తారరన్నారు. వేలంలో పాల్గొనే వారు వారి ఆధార్ కార్డు నకలు తీసికొని రావలెనన్నారు. ధరావత్తు రూ.2 వేలు సొమ్మును జమచేసి వేలంలో పాల్గొనవలసి ఉంటుందన్నారు. వేలంలో వాహనము దక్కించుకున్న వారు వెంటనే మొత్తం సొమ్మును చెల్లించాలన్నారు. వివరాలకు సెల్ నెం.95059 68533, 91609 88844 సంప్రదించాలన్నారు.

సృజనాత్మకతకు ప్రాజెక్టు వర్కులు దోహదం

ప్రజాశక్తి-ఐ.పోలవరం


వి.మమతశ్రీని అభినందిస్తున్న తహశీల్దార్

విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మకత పెంపొందించటానికి ప్రాజెక్టు వర్కులు దోహద పడతాయని, తహసిల్దార్ ఝాన్సీ లక్ష్మి కుమారి అన్నారు. ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ విత్తనాల శ్రీనివాసరావు కుమార్తె మమతశ్రీ 8వ తరగతి రాజమహేంద్రవరం చైతన్య టెక్నో స్కూల్ సివిల్స్ బ్యాచ్ లో చదువుతోంది. ఆయన మేనల్లుడు కడలి శ్రీరామ్ 7వ తరగతి చదువుతున్నాడు.ఈ విద్యార్థులను మంగళవారం ఐ పోలవరం మండలం తహసిల్దార్ ఝాన్సీ లక్ష్మి కుమారి అభినందించారు. ఇటీవల విద్యార్థి విత్తనాల మమత శ్రీ పీస్ టైమ్ గాలంట్రీ అవా ర్డ్స్ ఫర్ బ్రేవరీ సోల్జియర్ అంశం పై ప్రాజెక్ట్ వర్క్ ను చేశారు. కడలి శ్రీరామ్ నోబెల్ బహుమతి గ్రహీతల అంశం పై ప్రాజెక్ట్ వర్క్ చేశారు. వీటిని తహశీల్దార్ కు చూపించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతికి ఈ విద్యార్థులు చేసిన ప్రాజెక్ట్వర్క్ స్ఫూర్తిదాయకంమన్నారు. తల్లిదండ్రులు విత్తనాల శ్రీనివాసరావు, పూర్ణిమలను, కడలి శ్రీరామ్ తల్లి నాగలక్ష్మిని తహశీల్దార్ అభినందించారు.


మాట్లాడుతున్న కోఆప్షన్ సభ్యులు రాజాబాబు

టిడ్కో ఇళ్లపై కౌన్సిల్ సమావేశంలో వాగ్వాదం

ప్రజాశక్తి-మండపేట

స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మునిసిపల్ ఛైర్పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన మంగళవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా టిడ్కో ఇళ్లకు సంబంధించి అధికార స్వపక్ష కౌన్సిల్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు మాట్లాడుతూ ప్రధాన వసతులైన తాగునీరు సెప్టిక్ ట్యాంక్ తదితర పనులు పూర్తిగా కాకుండా గహప్రవేశాలు ఎలా చేశారని ప్రశ్నించారు. అనంతరం మునిసిపల్ ఛైర్ పర్సన్ రాణి మాట్లాడుతూ అతి త్వరలో లబ్ధిదారులందరికీ ఇల్లు ఇస్తామన్నారు. అజెండాలోని పేర్కొన్న 17 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పలువురు కౌన్సిల్ సభ్యులు పలు సమస్యలను కౌన్సిల్ దష్టికి తీసుకువచ్చారు. ఆరవ వార్డులోని లేగావారి వీధిలో కుళాయి పనిచేయడం లేదని కుళాయి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక గొల్లపుంత కాలనీలోని టిడ్కో ఇళ్ల వద్ద సౌకర్యాలు కల్పనలో జాప్యం జరుగుతోందన్నారు. దోమలు, ఈగలు విజంభిస్తూ ఉండడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందన్నారు. టిడ్కో ఇళ్ల సముదాయంలో 25 బ్లాక్ లకు తాగునీరు అందించమన్నారు. కుళాయి రిపేర్లకు టెండర్ పూర్తి అయ్యిందని ఛైర్ పర్సన్ రాణి, మున్సిపల్ అధికారులు అన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ పోతంశెట్టి వరప్రసాద్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా అప్పలస్వామి

ప్రజాశక్తి-ఐ.పోలవరం


అప్పలస్వామి

మండలంలోని జి.మూలపొలం ప్రాథమిక పాఠశాల్లో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న రేవు అప్పలస్వామి యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్గా ఎన్నిక య్యారు. ఇటీవల మండపేటలో జరిగిన యుటిఎఫ్ జిల్లా నూతన కౌన్సిలర్ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు యుటిఎఫ్ ఐ.పోలవరం మండల శాఖ అధ్యక్షులు మట్టపర్తి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గంటా సూర్యచంద్రరావు, జిల్లా కార్యదర్శులు టీ.దుర్గాప్రసాద్,పెన్నాడ శ్రీనివాస్ అభినందలు తెలిపారు.


సర్వేను పరిశీలిస్తున్న సర్పంచ్‌లు

గొల్లవిల్లిలో డ్రోన్ సర్వే

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

జగనన్న భూ సర్వే శాశ్వత భూహక్కు పథకం ద్వారా గొల్లవిల్లిలో డ్రోన్ ద్వారా మంగళవారం భూ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గొల్లవిల్లి, మునిపల్లి, పెదగాడవిల్లి, చినగాడవిల్లి, సన్నవిల్లి గ్రామాల్లో ఫ్లయింగ్ డ్రోన్ ద్వారా సర్వే చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్లు జొన్నాడ శ్రీదుర్గ, చిక్కం పెదబాబు, యర్రంశెట్టి రామచంద్రరావు, వైసిపి నాయకులు వీరవల్లి చినబాబు, జొన్నాడ చిన్ని, దూలం శ్రీనివాసరావు, విఆర్ఒలు చంద్ర శేఖర్, పి.బాలాజీరావు, మమత పాల్గొన్నారు.



కార్టూ'నిజం'

నకిలీదా..? చీకటిదా..? సార్..!

నేటి నుంచి భీమేశ్వరుని కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి -రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వారం రోజుల పాటు జరిగే కల్యాణానికి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని ఆలయ ఇఒ తారకేశ్వరరావు తెలిపారు. ఉత్సవాల్లో రాష్ట్ర మంత్రి వేణు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. బుధవారం రాత్రి 10.25గంటలకు స్వామివారి కల్యాణం, 3 న సదస్యం, 4 న రథోత్సవం, 5 న తెప్పోత్సవం, 6న వసంతోత్సవం, 7న పుష్పోత్సవం నిర్వహిస్తారని, యాత్రికులు పాల్గొనాలన్నారు.

భీమేశ్వరుని నూతన రథం సంప్రోక్షణ


కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వేణు

భీమేశ్వరునికి నూతనంగా తయారుచేసిన రథానికి మంగళవారం సంప్రోక్షణ నిర్వహించారు. మంత్రి చెల్లు బోయిన వేణు గోపాల కృష్ణ పాల్గొని మాట్లాడుతూ రథానికి 100 సంవత్సరాలు సరిపడే విధంగా నాణ్యమైన కలప వినియోగించారన్నారు. ప్రాచీన రథంలో ఎలాంటి ఆధ్యాత్మిక ఆకృతులు ఉన్నాయో అదే తరహాలో నూతన రథాన్ని తయారుచేశారన్నారు. రథానికి అమర్చిన హైడ్రాలిక్ బ్రేకులతో తేలికగా కదిలే విధంగా పెద్ద చక్రాలు ఏర్పాటుచేశారన్నారు. ఈ రథం కేవలం 45 రోజుల్లో తయారుచేశారన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఇఒ పి.తారకేశ్వరావు, వై సిపి నాయకులు పెట్టా శ్రీనివాస్, టేకుముడి సత్య నారాయణ, సర్పంచ్ లు యాల్లమిల్లి సతీష్ కుమారి, అనిశెట్టి రామకష్ణ. నాగిరెడ్డి సతీష్ రావు, కొత్తపల్లి అరుణ, మాగాపు అమ్మిరాజు. తదితరులు పాల్గొన్నారు. ద్రాక్షారామ ఎస్ఐ వినోద్ శాంతి భద్రతలు పర్యవేక్షించారు.

ఫారం-బి రెన్యువల్స్ పరిశీలన

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని కృష్ణ ప్రభాస్, మాధవి, గాయత్రి, గోదావరి, కోస్టల్ సాల్వెంట్ ఆయిల్ కర్మాగారాలలో ఫారం - బి లైసెన్స్ రెన్యువల్స్ను జెసి ధ్యానచంద్ర.హెచ్ఎం మంగళవారం పరిశీలించారు. అనంతరం మండలంలో జరుగుతున్న రీ సర్వే గురించి తహశీల్దార్ టి ఆర్.రాజేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్ఐ గౌరీదేవి, విఆర్ఒలు ఉన్నారు.

హైస్కూల్ తిరిగి తెరవాలని సర్వమత ప్రార్థనలు

పజాశక్తి-రామచంద్రపురం



ద్రాక్షారామలో సర్వ మత ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

ద్రాక్షారామలో గల పివిఆర్ హైస్కూల్ గత రెండేళ్లుగా మూతపడటంతో దానిని తిరిగి తెరవాలని పూర్వ విద్యార్థులు బాగా పెమరాజు సారథ్యంలో వారం రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇక్కడ సుభాష్ చంద్రబోస్ సెంటర్ వద్ద సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ, బ్రాహ్మణులు, ముస్లిం మత పెద్దలు ఆధ్వర్యంలో పివిఆర్ పాఠశాల యాజమాన్యం పైడా సత్యప్రసాద్ మనసు మార్చి పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా విద్యాసంస్థలను కొనసాగించాలని ఈ సందర్భంగా ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు పూర్వ విద్యార్థులు, ద్రాక్షారామ గ్రామస్తులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపాన్ని గుర్తించేందుకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం


విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

విద్యార్థుల్లో అయోడిన్ లోపం గుర్తించేందుకు గాయిటర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అంగర పిహెచ్సి వైద్యాధికారులు డాక్టర్ పిఎన్ఎస్డి.రత్నకుమారి, డాక్టర్ .జె.అనూజ ప్రియాంక లు తెలిపారు. మంగళవారం అంగర పిహెచ్సి పరిధిలో ఎంపిక చేయబడిన కపిలేశ్వరపురం సచివాలయ-2 పరిధిలోని కోరాటి వారి వీధి, దేవి సెంటర్ ప్రాథమిక పాఠశాలల్లో అయోడిన్ లోపం, రుగ్మతల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా సుమారు 90 మంది విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించారు. వీరిలో 18 మంది విద్యార్థుల, ఇళ్ల నుంచి భోజనం తయారీలో ఉపయోగించే ఉప్పును, 9 మంది పిల్లల నుంచి మూత్ర నమూనాలు, సేకరించి పరీక్ష నిమిత్తం ముమ్మిడివరం ఎన్సిడిసి లో అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రామారావు, హెల్త్ సూపర్వైజర్ సురేష్, హెచ్ఎం ఐ.సూరిబాబు, ఎ.శ్రీనివాస్, ఎంఎల్హెచ్పి పి.దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.


ఆశీర్వాదాన్ని సత్కరిస్తున్న వెంకన్నబాబు

ఏడిద సర్పంచ్‌కు సత్కారం

ప్రజాశక్తి-మండపేట

జిల్లా ఉత్తమ సర్పంచ్ గా అవార్డు అందుకున్న ఏడిద గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదంను వైసిపి రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకన్నబాబు మాట్లాడుతూ ఆశీర్వాదం చేసిన సేవలను ప్రభుత్వం గుర్తించి ఆయనకు అవార్డు అందించడం ఆనందాయకమన్నారు. కార్యక్రమంలో మండల ఆర్బికె ఛైర్మన్ అన్నందేవుల చంద్రరావు, మాజీ ఎంపిటిసి సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్, పలివెల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడలో వీధులకు ప్రముఖుల పేర్లు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరంలో కులాల పేర్లతో పలు వీధులు, పేటలు వాడుకలో ఉన్నందున తమ దృష్టికి వచ్చిన అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకుని వాటికి ప్రముఖుల పేర్లతో నామ కరణం చేసినట్లు కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వెల్లడించారు. స్థానిక సూర్యారావుపేట కార్యాల యంలో మంగళ వారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాల పేర్లతో దాదాపు 15 వీధులకు ఉన్నాయ న్నారు. గత డిసెంబరు 29న జరిగిన జిల్లా స్థాయి విజిలెన్స్ మోనటరింగ్ సమావేశంలో కులం పేరుతో వీధుల పేర్లు అధికారికంగా రికార్డులలో నమోదు కాబడి వాడుకలో ఉన్నాయని వాటి పేర్లు మార్చాలని వచ్చిన అభ్యంతరాలు దృష్టిలో పెట్టుకుని గుర్తింపు పొందిన ప్రముఖ వ్యక్తుల పేర్లు గుర్తించి కలెక్టర్ అనుమతులతో మార్చినట్లు తెలిపారు. కులాల పేర్లతో వీధుల పేర్లు ఉండరాదని కోర్టు ఆదేశాలను అనుసరించి ఈ మార్పు చేశామన్నారు. ఆయా వీధులు పేర్లు వివరించారు. జగన్నాధపురం రెల్లి వీధి-ప్రతిపాదిత పేరు శ్రీవడ్డి పోలమాంబ వీధిగా, మీసాల అనంతరావు వీధి, రజక వీధి-దుర్గాదేవి వీధి, కాపు వీధి-చామకూర నాగ బాబు వీధి, ఎస్.అచ్యుతాపురంలోని హరిజనపేట-డాక్టర్ బీఆర్. అంబేద్కర్ వీధి, దేవాలయం వీధిలోని తెలుకుల వీధి-చంద్రపు స్వామి జియ్యారావు వీధి, సినిమా రోడ్డులోని కాబూలీ వీధి- ఆంజనేయస్వామి వీధి1,2., సూర్యనారాయణ పురం గొల్లల వీధి-కష్ణని వీధి 1,2., రెల్లి వీధి-శబరి వీధి, బాలాజీ చెరువు రజక వీధి-నూకల రాధ వీధి, సాలిపేట-రావు గోపాలరావు వీధి, ప్రతాప్ నగర్ శెట్టిబలిజ వీధి-వాసంశెట్టి మధు వీధి, పోర్టు రైల్వే స్టేషన్ ఏరియా కాపులవీధి-ద్వారబంధాల చంద్రయ్య వీధిగా నామకరణం చేసినట్లు తెలిపారు. లోకేష్ పాదయాత్రకు అర్థం లేదన్నారు. ప్రజలంతా సంతోషంగా ఉన్నపుడు పాదయాత్ర ఎందుకో లోకేష్ కే తెలియాల న్నారు. లోకేష్ పాదయాత్ర మనుగడ కోసమే తప్ప, ప్రజల కోసంకాదన్నారు. జగన్ కరోనా కష్టకాలంలో కూడా పథకాలు సంపూర్ణంగా ప్రజలకు అందించారని, పథకాలు పొందిన వారు పాదయాత్రలో, ఇదేమి ఖర్మ లో పాల్గొనవద్దని కోరారు. కార్యక్రమంలో కౌడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, మాజీ మేయర్, వైసీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, పసుపులేటి వెంకట లక్ష్మీ పాల్గొన్నారు.



40వ డివిజన్‌లో రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ కొండబాబు

40వ డివిజన్‌లో 'ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి'

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

సంక్షేమ పథకాలుకు రాజకీయాలకు ముడి పెట్టే హీనస్థితిలో వైసిపి నాయకులు ఉన్నారని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు విమర్శించారు. వైసిపి పాలనలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి ఇదేమి కర్మ మన కాకినాడకు కార్యక్రమంలో భాగంగా సోమవారం 40 డివిజన్‌లో కొండబాబు పాల్గొన్నారు. సంక్షేమ పథకాలు రానివారు తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న ఇదేమి ఖర్మ కార్యక్రమంలో పాల్గొంటున్నారని కాకినాడ ఎంఎల్ఎ ద్వారంపూడి వ్యాఖ్యానించడంపై ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలు అందడం లేదని ఎంఎల్ఎ ఒప్పుకుంటున్నాడని, తెలుగుదేశం పార్టీ ఇదేమి ఖర్మ కార్యక్రమంలో పాల్గొనేవారు సంక్షేమ పథకాలు వదులుకుని తిరగాలని వాఖ్యానించడం ద్వారంపూడి అవగాహన రాహిత్యానికి నిదర్శనమని, దోపిడి ద్వారంపూడి రెడ్డి దోచుకుంటున్న సొమ్ముని ఏమైనా సంక్షేమ పథకాలకు ఇస్తున్నాడా అని ప్రశ్నించారు. వైసీపీ దుర్మార్గ పాలనతో రాష్ట్ర ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారని, అమ్మఒడితో ఇచ్చి నాన్నబుడ్డితో లాగేస్తున్నాడని, పేద వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన పార్టీయే తెలుగుదేశం పార్టీ అని అన్నారు. కార్యక్రమంలో మల్లిపూడి వీరు, నెక్కంటి ఝాన్సీ రాణి, డివిజన్ నాయకులు మీసాల సునీత, సుందరపల్లి సత్తిబాబు, మీసాల మధు, జొన్నాడ వెంకటరమణ, మంతిన విజయరామరాజు, గంగుమళ్ల మురళిబాబు, సముద్రాల రమేష్, బిక్కిన కామేశ్వరరావు, ముత్యాల సూర్యనారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ 7వ డివిజన్‌లో సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మదర్ థెరిస్సా విగ్రహం నుంచి నుంచి ప్రారంభించారు. ఇంటింటికి వెళ్ళి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ మూడున్నరేళ్ళపాలనలో ప్రభుత్వం అమలుచేసిన పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు ప్రభుత్వం పేరుతో మొక్కుబడి పర్యటనగా కాకుండా ప్రజలు చెప్పిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు వీలుగా ప్రతి సచివాలయ పరిధికి 20 లక్షల రూపాయలు చొప్పున నిధులు కేటాయించడం ముఖ్యమంత్రి చిత్తశుద్ధికి నిదర్శన మన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి మళ్ళీ మళ్ళీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఆయన వెంట వైసిపి నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్నసాగర్, అదనపు కమిషనర్ సిహెచ్ నాగనరసింహారావు, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిఈ మాధవి, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి ఉన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి ఒక్కరూ వినియోగదారుల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణఃమూర్తి అన్నారు.మంగళవారం పెద్దాపురం మండలం చదలాడ పంచాయతీ కార్యాల యంలో జరిగిన వినియోగదారుల చట్టాలపై జరిగిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ వస్తువులు కొనుగోలు చేసినప్పుడు కొలతల్లో తేడాలు వచ్చినా,నాణ్యతలో తేడాలు వచ్చినా, మోసాలు జరిగినా, కల్తీలు జరిగినా ఈ చట్టం ద్వారా న్యాయం పొందవచ్చున్నారు. సంఘ సెక్రటరీ ఎం భాస్కరరావు,సభ్యులు కేవివి లక్ష్మి, సచివాలయ కార్యదర్శి బి ఈశ్వరరావు, వీఆర్వో పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలపై దాడులు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణ పరిధిలోని పలు రేషన్ దుకాణాలపై మంగళవారం సివిల్ సప్లయిస్ అధికారులు దాడులు నిర్వహించారు. జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి జి.చాముండేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో 8వ నెంబర్ రేషన్ షాపులో 108 క్వింటాళ్ల బియ్యానికి సంబంధించి లెక్కలు రికార్డులు పూర్వకంగా సక్రమంగా లేకపోవడంతో షాపు యజమానిపై 6 ఏ కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్ఓ చాముండేశ్వరి తెలిపారు. ఈ దాడుల్లో ఎఎస్ఓ ప్రసన్న లక్ష్మీదేవి, ఎంఎస్ఓ విజయ్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

నూకరాజు కుటుంబానికి పలువురి పరామర్శ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇటీవల మృతి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్, వైసిపి నాయకులు తూతిక నూకరాజు కుటుంబ సభ్యులను మంగళవారం వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కట్టా రాజ బాబు, కోఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, వైసిపి నాయకులు ఽ ఁ న ఽ ా ల సుబ్రహ్మణ్యేశ్వరరావ్, రాజశేఖర్, ఎం. ప్రకాష్, సహారా రమేష్, వాసం శెట్టి చిన్న, రజక సంఘం అధ్యక్షులు వీరేశ్వరపు ఏసుబాబు పాల్గొన్నారు.



నూకరాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎలుకల నివారణలో
విద్యుత్ వినియోగించవద్దు

ప్రజాశక్తి - కాజులూరు

ఎలుకల నివారణలో విద్యుత్ వినియోగించరాదని మండల వ్యవసాయ అధికారి ఏ.అశోక్ తెలిపారు. మంగళవారం మండలంలోని సలపాక గ్రామంలో ఎఒ అశోక్ మాట్లాడుతూ రబీలో ఎలుకలను నివారించేందుకు విద్యుత్తు వైర్లు అమర్చి ఎలుకలను నివారించేందుకు కొందరు రైతులు చర్యలు తీసుకున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. విద్యుత్ తీగలు అమర్చడం చాలా ప్రమాదకరమని వెంటనే తొలగించకపోతే తగిన చర్యలు తీసుకుంటా మన్నారు. ఎలుకల నివారణకు గురువారం నుండి బ్రోమో డైయాలిన్ మందును రైతు భరోసా కేంద్రాల ద్వారా ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులు శిరీష, రైతులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలో తృతీయ బహుమతి పొందిన బాలికల జట్టు

రగ్బీలో గురజానపల్లి విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి -కరప

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో గుజనాపల్లి విద్యార్థినులు ప్రతిభ కనబరచి తతీయ స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం బిఆర్ వి ప్రసాద్‌రావు తెలిపారు. కర్నూలులో జనవరి 29 నుండి 31 వరకు జరిగిన స్కూల్ గేమ్స్ అండర్ 17 రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరపున ఆడిన పబ్బినీడి పాపారావు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, గురజానపల్లి విద్యార్థినులు జి.కృష్ణ తేజ, పి.సునంద తేజశ్రీ, వై.జ్యోతి చంద్రిక పాల్గొన్న జుట్టుకు రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి పొందారు. కర్నూలు జిల్లాలో ప్రముఖ విద్యా సంస్థలు ఆదర్శ విద్యాలయ అధినేత తిమ్మయ్య షీల్డ్ అందించారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు నాగలింగేశ్వరరావును, విద్యార్థినులను హెచ్ఎం బి ఆర్.వి.ప్రసాదరావు, విద్యా కమిటీ చైర్మన్ పబ్బినీడి వీరబాబు, గ్రామ సర్పంచ్ అనసూరి శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ ఇవ్వల ప్రసాదరావు, వివి రమణమూర్తి, బి.ఎస్.శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయ బృందం గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు అభినందించారు.

టిడిపితోనే బిసిలకు సముచిత స్థానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

తెలుగుదేశం పార్టీతోనె బలహీన వర్గాల అభివద్ధి సాధ్యమని ప్రతిపాది టిడిపి ఇన్‌ఛార్జ్ వరుకుల రాజా అన్నారు. ప్రతిపాడు మండలం ఏలూరుకి చెందిన సీనియర్ టిడిపి నేత రొంగల సత్యనారాయణను పార్టీ అధిష్టానం రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేసింది. ఈ మేరకు సత్యనారాయణను మంగళ వారం వరుపుల రాజా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు కోళ్ల ఫారాలు దగ్ధం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో రెండు కోళ్ల ఫారాలు దగ్ధమయ్యాయి. ఫారాల యజమాని రీసు సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం మూడు లక్షల పైగా ఆస్తి నష్టం సంభవించింది. ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా భావిస్తు న్నారు. సంఘటనా స్థలాన్ని ప్రతిపాడు టిడిపి ఇన్చార్జ్ వరుపుల రాజా, టిడిపి శ్రేణులు చేరుకుని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు.



పాలగుమ్మిలో వికలాంగునితో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ప్రజాసంక్షేమమే వైసిపి ప్రభుత్వం పాలన లక్ష్యమని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మంగళవారం మంత్రి అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మి, చప్పిడివారిపాలెం, కంభంపాడు, పెద్ద పేట గ్రామాల్లో 'గడప..గడపకూ మన ప్రభుత్వం'లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పినిపే శ్రీకాంత్, పాలగుమ్మి గ్రామ సర్పంచ్ కూడుపూడి రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కమిటీకి సత్కారం

ప్రజాశక్తి-మండపేట

నూతనంగా ఎన్నికైన జిల్లా విశ్వబ్రాహ్మణ నూతన కమిటీ కార్యవర్గం విన్నకోట రాధాకృష్ణ ప్రసాద్, కోటిపల్లి కృష్ణమాచార్యులు, దార్ల స్వామిలను జాతీయ బిసి సంఘం ఆధ్వర్యంలో స్థానిక కామాక్షి కల్యాణ మంటపంలో మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలోబిసి సంఘ నాయకులు పిల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో
నిందితునికి 6నెలల జైలు

ప్రజాశక్తి -ఉప్పలగుప్తం

భార్యపై హత్యాయత్నం చేసిన కేసులో నిందితునికి మంగళవారం అమలాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.శైలజ ఆరు నెలలు జైలు శిక్ష విధించారు. ఎస్ఐ జి. వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలివి.. ఉప్పలగుప్తం చీకట్లపాలెంకు చెందిన దుర్గకు అతని మేనమామ పుల్లయ్య నాయుడుతో వివాహమై మనస్పర్ధలు వచ్చి 15 ఏళ్ల క్రితం విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. అదే పంచాయతీ బడుగువారిపేటకు చెందిన కుంచే లక్ష్మణరావుతో దుర్గకు పరిచయం ఏర్పడి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అప్పటి నుంచి దుర్గతోపాటు ఆమె ఇద్దరు కుమార్తెల బాగోగులను లక్ష్మణరావు చూసుకునేవాడు. అయితే దుర్గ పై అనుమానం పెంచుకున్న లక్ష్మణరావు ఆమెతో మనస్పర్ధలు వచ్చి విడివిడిగా ఉంటున్నారు. తరచూ లక్ష్మణరావు దుర్గకు ఫోన్ చేసి బెదిరించేవాడు. ఈ నేపథ్యంలో 2020 జనవరి16న లక్ష్మణరావు దుర్గ ఇంటికి వచ్చి కత్తితో దుర్గపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దుర్గ చికిత్స నిమిత్తం అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చేరింది. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు అప్పటి ఎస్ఐ కె.సురేష్ బాబు కేసు నమోదు చేసి లక్ష్మణరావు ని అరెస్టు చేసి అమ లాపురం కోర్టులో హాజరు పరిచి చార్జిషీట్ దాఖలు చేశారు. మంగళవారం అమలాపురం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.శైలజ పై విధంగా తీర్పు వెలువరించారు.

ప్రయోజనకర ప్రణాళికలు అమలు చేయండి

- మార్టేరు వ్యవసాయ సహ సంచాలకులు డాక్టర్ భరత్ లక్ష్మి



జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ భరత్ లక్ష్మి

ప్రజాశక్తి - పెద్దాపురం

రాబోయే రోజుల్లో రైతులకు అధిక దిగుబడులు, అధిక ఆదాయం లభించే విధంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని మారిటేరు వ్యవసాయ సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం భరత్ లక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో అభ్యుదయ రైతులతో ఏర్పాటుచేసిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి ప్రసంగిం చారు. ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని, రైతులకు ఉపయుక్తమైన సలహాలను అందించడమే కాకుండా వారి కమతాల్లోనే వ్యవసాయ పరిశోధనలను ప్రయోగా త్మకంగా అమలు చేసి అవగాహన కల్పిస్తున్నార న్నారు. కార్యక్ర మంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టి.ముకుందరావు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో వివిధ ప్రాంతాలలో వాతావరణ పరిస్థితులు, చీడపీడలు, ముంపును తట్టుకునే వంగడాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు క్షేత్ర ప్రదర్శనలు చేపట్టాలన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్ వి నరసింహారావు మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి సంబంధించి ఏరువాక కేంద్రం విస్తరణ ప్రయోగాల ఫలితాలను సభకు నివేదించారు. రైతులకు ప్రయోజనం కలిగే రీతిలో శిక్షణ కార్యక్రమాలను రూపొందించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ డైరెక్టర్ బివి రమణ,ఆత్మ పిడి జ్యోతిర్మయి ప్రసంగించారు.

రాజవరంలో గడప... గడపకూ

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని రాజవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ మంగళ వారం గ్రామంలో వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పలు నివాసాలకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు జడ్‌పిటిసి గొల్లు లక్ష్మణ మూర్తి, వైసిపి మండల అధ్యక్షులు శ్రీను, ఎంపీటీసీ సోమరౌతు సీతారామ స్వామి, ఎంపీడీవో ఎం.గోవిందు స్థానిక నాయకులు సోమరౌతు తిరుమల వెంకన్నదొర ఉన్నారు.

రాష్ట్రస్థాయి సిఎం కప్ పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ఎపి క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు వచ్చే నెల నిర్వహించనున్న ఎ.పి.సి.ఎం.కప్ రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా నుంచి పాల్గొనడానికి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, కాకినాడ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో 18 సంవత్సరాల పైబడి 35సం.ల లోపు పురుషులకు, మహిళలకు హాకీ, కబడ్డీ, ఫుట్ బాల్, ఖోఖో క్రీడలలో ఎంపిక పోటీలు నిర్వహించారు. టెన్నిస్‌లో ఐదుగురు పురుషులు, ముగ్గురు మహిళలు, క్రికెట్ టీమ్‌కు 15 మంది పురుషులు, ఫుట్ బాల్ టీమ్‌కు 18 మంది పురుషులు, కబడ్డీ టీమ్‌కు వీరిలో 12 మంది పురుషులు 9 మంది మహిళలు, ఖోఖో టీమ్‌కు 12 మంది పురుషులు, 12 మంది మహిళలు, హాకీ టీమ్‌కు 18 మంది పురుషులు, 18 మంది మహిళలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ ఎంపికలను హాకీ క్రీడాకారులను కాకినాడ జిల్లా పి.ఇ.టి అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా హాకీ అసోసియేషన్ కన్వీనర్ రవిరాజు, ఖోఖో, కబడ్డీ క్రీడాకారులను జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి కె.పట్టాభిరామం, తూర్పుగోదావరి జిల్లా ముఖ్య క్రీడా శిక్షకులు డి.ఎం.ఎం.శేషగిరి ఎంపిక చేశారు. ఈ ఎంపిక కార్యక్రమంలో ఆయా క్రీడల కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీల ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతే!

ప్రజాశక్తి -కరప

అమరావతి ఎప్పటికీ ఆంధ్రప్రదేశ్ రాజధాని అని కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి అన్నారు. విజయరాయుడు పాలెంలో మంగళవారం ఇంటింటికి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తితో కలిసి నిర్వహించారు. అమరావతే రాజధాని అని చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చాక మాట మార్చా రన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అంటే సీఎం జగన్‌కు లెక్క లేదన్నారు. రాజధాని విషయంలో కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండగా వైసిపి చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, బుంగా సింహాద్రి నాయకులు మాతా అబ్బాయి, మాదాసు ప్రసాద్, ఈశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.



విజయరాయుడుపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ పిల్లి అనంతలక్ష్మి

జాబ్‌మేళాలో 11 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట టీటీడీసీలో మంగళవారం నిర్వహించిన మినీ జాబ్ మేళాలో 11 మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సీడాప్, ఏపి ఎస్ ఎస్ డి సీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళా కు 32 మంది హాజరు కగా 11 మంది అర్హత సాధించారు.. డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీకి ఇద్దరు, శ్రీ గోపాల్ ఆటోమేటిక్ లిమిటెడ్‌కు నలుగురు, బ్లూ ఒసియన్ కంపెనీకి అయిదుగురు చొప్పున యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ జాబ్ మేళాలో జిల్లా జాబ్స్ మేనేజర్ కేశవరావు, డిఎస్డివో హరి శేషు, ప్లేస్ మెంట్ కో ఆర్డినేటర్ చంద్రరాజు, శ్యామ్, కంపెనీల హెచ్ఆర్ మేనేజర్లు పాల్గొన్నారు.

విజయ బ్యాంక్ మేనేజర్‌కు జైలు, జరిమానా

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మండల కేంద్రంలో ఉన్న విజయ బ్యాంక్ మేనేజర్ పాలంకి రఘురామ్‌కు రెండు సంవత్సరాలు జైలు, రూ.10వేలు జరిమాపా విధిస్తూ ముమ్మిడివరం మెజిస్ట్రేట్ ఎస్.శ్రీనివాస్ మంగళవారం తీర్పు వెలువరించినట్లు ఐ.పోలవరం ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు. వివరాలు ఇవి 1995 మే31 నుంచి నుంచి 1997 మే 30 మధ్య కాలంలో ఐ.పోలవరం విజయ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ పాలంకి రఘురామ్, 9 మంది కలిసి బ్యాంక్ రికార్డులను తారు మారుచేసి, తప్పుడు పట్టాల నెంబర్లు రశీదులు పొంది 95మంది పంట లోన్లు మంజూరు చేశారని, అప్పటి బ్యాంక్ మేనేజర్ ముత్యాల రాజేంద్ర ప్రసాద్ 9సెప్టెంబరు 2000 సంవత్సరం సెప్టెంబర్ 9న ఐ.పోలవరం ఎస్ఐ యు.మార్తాండరావు కు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి ముమ్మిడివరం సిఐ బండారు గురునాథం, జె ప్రభాకరరావు దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జ్ షీట్ ఫైల్ చేశారు. అయితే కేసు వాదోపవాదాల అనంతరం ప్రథమ నిందితుడు అయిన పాలంకి రఘు రామ్‌కు రెండు సంవత్సరాలు జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా, జరిమానా కట్టక పోతే అదనంగా 2 నెలలు జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ ఎస్.శ్రీనివాస్ తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు. కేసు లో ప్రాసిక్యూషన్ తరపున ఎపిపి జి.విజయ, ఎన్.రాధిక, సిహెచ్. రాజశేఖర్ వాదనలు వినిపించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-మండపేట

రాయవరంలో రామయ్య జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు జెడ్‌పిటిసి సభ్యురాలు మంగతాయారు, ఎంపిపి నౌడు వెంకటరమణ, ఎంపిడిఒ శ్రీనివాసరావులు స్టడీ మెటీరియల్ ను మంగళవారం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం పప్పు శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

వెండి కలశాల బహూకరణ

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

అంగరలో వేంకటేశ్వర స్వామి ఆలయానికి దాతలు 9 వెండి కలశాలు మంగళవారం బహూకరించారు. వెంకటేశ్వర స్వామి అష్టమి బ్రహ్మోత్సవాలు సందర్భంగా పలు గ్రామాలకు చెందిన తొమ్మిది మంది దాతలు స్వామివారికి వెండి కలశాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కె. బాల బాలాజీ ఆధ్వర్యంలో కలశ, విశేష పూజలు నిర్వహించారు.

గెయిల్ పైప్‌లైన్ల రక్షణపై అవగాహన

ప్రజాశక్తి - ఆలమూరు

మోదుకూరులో గెయిల్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు సహజవాయువు పైప్లైన్లు వాటి రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంగళవారం బుర్రకథ నిర్వాహకులు గొర్రెల రాము, కష్ణ సోదరులు సహజవాయువు పైప్లైన్లు వాటి రక్షణకు అమర్చిన వాల్వులు, వివిధ యంత్రాలు, హెచ్చరిక బోర్డులు, చిహ్నాలను సూచించే స్తంభాలను అందరూ రక్షించుకోవాలని తెలిపారు. వీటిని పాడు చేయకుండా రక్షించుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. ఇందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను బుర్రకథ ద్వారా తెలియజేశారు.



చేపల చెరువులో పడి యువకుడి మృతి

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండల పరిధి పటవల గ్రామానికి చెందిన నామ శివబాబు (30) ప్రమాదవశాత్తు చేపల చెరువులో పడి మతి చెందినట్లు కోరింగ్ ఎస్ఐ నివాస కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన శివబాబు పశువులను మేపుకునేందుకు సమీపంలోని చేపల చెరువు వద్దకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో ప్రమాద వశాత్తు అదుపుతప్పి చెరువులో పడిపోయి ఉంటాడని భావిస్తున్నా మన్నారు. శివబాబు చెప్పులు చెరువులో తేలుతుండడంతో స్థానికులు విఆర్ఒకు సమాచారం అందజేశారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శ్రీనివాస్ కుమార్ తెలిపారు.